నకిలీ మనవడు గుట్టురట్టు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ఉక్కు నిర్వాసితుల పోరాట ఫలితం గా ఆర్ కార్డును వారసులకు బదిలీ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఉద్యోగ అర్హత లేని వయసు మీరిన నిర్వాసితులు తమ ఆర్ కార్డును కొడుక్కో మనవడికో బదిలీ చేసి వారికి వచ్చిన ఉద్యోగంపై జీవనాధారం పొందడం నిర్వాసిత కుటుంబాల్లో జరుగుతుంది. దీన్ని అవకాశంగా మలుచుకుని ఒక ముసలి మామ్మకు మనవడి అవతారం ఎత్తి కుయుక్తితో ఆర్ కార్డు మార్చేసి ఉద్యోగం కొట్టేసాడు ఓ మాయలోడు. డిగ్రీ పూర్తి చేసిన అసలు మనవడు ఆర్ కార్డు మార్చుకోవాలని స్టీల్‌ప్లాంట్ భూ సేకరణ కార్యాలయంకి వెళితే ఆ కుర్రాడికి అసలు విషయం తెలిసి కుటుంబం నిర్ఘాంతపోయింది. పెదగంట్యాడ ఆర్‌హెచ్ కాలనీ నెల్లి ముక్కు గ్రామానికి చెందిన యెల్లేటి పెంటమ్మకు చెందిన 229 నెంబర్ ఆర్ కార్డును అగనంపూడికి చెందిన గండేపల్లి పరదేశి నాయుడు పెంటమ్మ కూతురు యెల్లేటి పెంటమ్మ అలియాస్ లక్ష్మి కొడుకుగా రికార్డులు సృష్టించి ఆర్ కార్డు మార్చుకుని స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం పొంది నేడు టౌన్ అడ్మిన్ విభాగంలో డిప్యూటీ మేనేజర్ హోదాలో ఉన్నాడు. అసలు వారసుడు ఫిర్యాదుతో వివరాలు చూస్తే పెంటమ్మ కూతురు పేరు పెంటమ్మ అలియాస్ లక్ష్మి అని ఉంది. పరదేశి నాయుడు తల్లి పేరు అప్పల నరసమ్మ. పరదేశి నాయుడు తల్లి అని చెబుతున్న లక్ష్మి పేరు తప్పుగా నమోదు అయిందేమో అని అధికారులు లోతుగా పరిశీలిస్తే పరదేశి నాయుడుకు 18 ఏళ్ల వయసు లో ఆర్ కార్డు మార్చుకునే తేది నాటికి పెంటమ్మ కూతురు వయసు 25 ఏళు అంటే లక్ష్మికి 7 ఏళ్ల వయసుకే పరదేశి నాయుడు పుట్టాడా అని అధికారులు తెల్లబోయారు.. ఆర్ కార్డు వారసుడు పెంటమ్మ కొడుకు దేముల్లు, మనవడు సూర్య ప్రకాష్ ఉక్కు అధికారులకు, భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి పత్రికా ప్రతినిధుల వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు.. అధికారులను వివరణ కోరగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పెంటమ్మను మోసగించి అక్రమ పద్ధతుల్లో ఉద్యోగం పొందిన గండేపల్లి పరదేశి నాయుడు ఆర్ కార్డ్‌ను రద్దు చేసి మాకు న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నారు.

బొజ్జన్నకొండకు అంతర్జాతీయ ఖ్యాతి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అనకాపల్లి సమీపంలో ఉన్న బొజ్జన కొండకు త్వరలోనే అంతర్జాతీయ ఖ్యాతి లభించనుందని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. అనకాపల్లి ఎంపీ బీశెట్టి సత్యవతి తీసుకువచ్చిన సుమారు 7.30 కోట్ల రూపాయల కేంద్ర నిధులతో బొజ్జనకొండ అభివృద్ధిలో భాగంగా ఆ ప్రదేశంలో ధ్యాన మందిరానికి వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ.సుబ్బారెడ్డి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ బీసెట్టి సత్యవతి ఆదివారం శంకుస్థాపన చేశారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ బొజ్జనకొండ అభివృద్ధికి శ్రీకారం చుట్టడం అనకాపల్లి చరిత్రలో శుభదినమని అన్నారు. జిల్లాల విభజన నేపథ్యంలో అనకాపల్లిని జిల్లాగా చేసి దీని అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ బొజ్జనకొండ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఏడున్నర కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, ఇందులో రెండున్నర కోట్ల రూపాయలతో బొజ్జనకొండ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలియజేశారు. హైవే నుంచి బొజ్జనకొండకు వచ్చే మార్గంలో శిలా తోరణం ఏర్పాటు చేస్తామని, అలాగే రెస్టారెంట్, పార్కింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అదేవిధంగా సౌండ్ అండ్ లైటింగ్ సిస్టం ద్వారా బొజ్జనకొండ ప్రాముఖ్యతను పర్యాటకులకు తెలియజేస్తామని అమర్నాథ్ వివరించారు. నాలుగు నుంచి తొమ్మిది శతాబ్దాలు మధ్య అంటే సుమారు 1500 నుంచి 2000 సంవత్సరాల కిందట జరిగిన బొజ్జనకొండ నిర్మాణాలు 1906లో బయటపడ్డాయని ఆయన తెలియజేశారు. ఇదిలా ఉండగా సుందరయ్యపేటలోని కేంద్రీయ విద్యాలయ సిబ్బంది క్వార్టర్స్‌కు, మిగిలిన పనుల కోసం పది ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి తెలియజేశారు. అలాగే అనకాపల్లిలో మూడు కోట్ల రూపాయలతో టీటీడీ కళ్యాణ మండపాన్ని కూడా నిర్మించ నున్నామని అమర్నాథ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బీశెట్టి సత్యవతి, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, అనకాపల్లి పార్లిమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్, అనకాపల్లి పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకి రామరాజు, జిల్లా పార్టీ కార్యదర్శి జాజుల రమేష్ పాల్గొన్నారు.

ప్లాంట్ పరిరక్షణకై రాజకీయ పార్టీలు తమ కార్యాచరణ ప్రకటించాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ రక్షణకై రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు తమ కార్యాచరణ ప్రకటించాలని సీపీఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల బైక్ ర్యాలీ సందర్భంగా ఉక్కునగరం, కూర్మన్నపాలెం, ఆగనంపూడి నుంచి ప్రారంభించి అన్ని సెక్టర్‌ల మీదుగా సెక్టర్ 3 వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తరాంధ్ర జీవనాడి అయిన విశాఖ ఉక్కు కర్మాగారంపై చేస్తున్న అష్టదిగ్బంధనానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు ఎందుకు వ్యతిరేకించడం లేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈనెల 29న జరుగుతున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర సిపిఎం నాయకులు ఎం.రామారావు, సిపిఎం స్టీల్ డివిజన్ కార్యదర్శి పి.శ్రీనివాసరాజు, ఐద్వా నాయకురాలు వేణు, స్టీల్ డివిజన్ సిపిఎం, సిఐటియు నాయకులు టి.చిరంజీవి, డిసిహెచ్ వెంకటేశ్వరరావు, జె. అయోధ్య రామ్, వై.టి.దాస్, రామస్వామి, యు.వి.రావు, పుల్లారావు, వి.ప్రసాద్, ఎస్‌కెకె మొహిద్దిన్, కె.బాలశౌరి, కెవి సుబ్రమణ్యం, బిఎన్ మధుసూదన్, కెవి సత్యనారాయణ, కె.సూర్యనారాయణ, రామచంద్ర రావు, భానుమూర్తి, కె.సత్యనారాయణ, కనకరాజు, తిమోతి, మహేష్, సాహు, దుర్గాప్రసాద్, పృధ్వి, ఉదయ భాస్కర్, రాజు, సంతోష్ కుమార్ రాజు, జగ్గారావు, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సి.ఆర్.రావు దేశానికే గర్వకారణం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారత దేశం గర్వించే వ్యక్తిగా ఆచార్య సి.ఆర్ రావు ఎదిగారని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. ఏయూ స్టాటస్టిక్స్ విభాగంలో నిర్వహించిన డాక్టర్ సి.ఆర్ రావు ఎండోమెంట్ లెక్చర్‌ను ఆమె ప్రారంభించారు. ముందుగా ఆచార్య సి.ఆర్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిగా ఆయన వర్సిటీ చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని యువత ఉన్నతంగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, విభాగాధిపతి ఆచార్య బి.ముని స్వామి తదితరులు ప్రసంగించారు. డాక్టర్ సి.ఆర్ రావు వద్ద విద్యనభ్యశించిన కాలిఫోర్నియా యూనివర్సిటీ ఆచార్యులు జె.శ్రీనివాసరావు 'ఫైనాన్షియల్ ప్రెడిక్షన్స్- దు న్యూస్ అండ్ ఎమోషన్స్ మేటర్' అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం ఆచార్య జె.శ్రీనివాసరావు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో కార్యాలయంలో భేటీ అయ్యారు. వర్సిటీ తరపున ఆచార్య శ్రీనివాస రావును సత్కరించారు. ఏయూతో అనుబంధం కొనసాగించాలని, మరింత బలోపేతం చేయాలని వీసీ ప్రసాద రెడ్డి కోరారు. ఏయూ విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - పరవాడ: ఉక్కు పరిరక్షణ యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం మండల పార్టీ నాయకుడు పల్లి అప్పారావు పిలుపు నిచ్చారు. ఆదివారం పరవాడ సినిమా హాల్ కూడలిలో ఆయన సీపీఎం నేతలతో కలిసి ఉక్కు పరిరక్షణ యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకోవడం కోసం ప్రజలందరూ పోరాడాలన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో నిర్మాణమైన ఈ స్టీల్ ప్లాంట్ ప్రజలందరి అస్తి అని దీన్ని కాపాదు కోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. ఈ యాత్ర 27వ తేది సాయంత్రం 3.30 గంటల నుంచి 4గంటల మధ్యలో స్థానిక సినిమా హాల్ కూడలి మీదుగా లంకెలపాలెం సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బొద్దు అప్పలనాయుడు, కన్నూరు నాయుడు, గొరుపూటి శ్రీను, వై.చిలికి నాయుడు, జి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య వ్యవస్థలో ఫార్మశిస్టులు కీలకం



విశాలాంధ్ర - విశాఖ సిటీ: వైద్య వ్యవస్థలో ఫార్మశిస్టులు కీలకమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. వరల్డ్ పార్మశీ డేని పురస్కరించుకుని ఏయూ ఫార్మశీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఆర్.కె బీచ్ నుంచి వైఎంసిఏ కూడలి వరకు ఏయూ ఫార్మశీ విద్యార్థులు, ఆచార్యులు ప్లకార్డులు పట్టుకుని సమాజంలో ఫార్మశిస్టుల ఆవశ్యకతను, వారి సేవలను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. నేటి సమాజంలో ఫార్మశిస్టుల సేవలు, బాధ్యతు పెరుగుతున్నాయని రిజిస్ట్రార్ అన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించిన కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి నవరాత్రులు

విశాలాంధ్ర - పాయకరావుపేట: వినాయక చవితి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో గణపతి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని కాసిన నూకరాజు వీధిలో శ్రీ లక్ష్మి గణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో నవరాత్రుల పురస్కరించుకొని సరస్వతి దేవి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ పూజను విద్యార్థులు, వారి తల్లిదండ్రులచే చేయించారు.

కేంద్ర మంత్రి స్మృతి ఇరానిని కలిసిన హెచ్‌ఎస్‌ఎల్ యూనియన్

విశాలాంధ్ర - మల్కాపురం: కేంద్ర మహిళ శిశు సంక్షేమ మంత్రి స్మృతి ఇరానీ, రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, పార్లమెంట్ సభ్యులు జీవీఎల్ నరసింహారావుకి హిందూస్తాన్ షిప్ యార్డ్ గుర్తింపు యూనియన్ మరియు ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులు ఆదివారం విశాఖపట్నం విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గుర్తింపు యూనియన్ నాయకులు కేంద్ర మంత్రికి షిప్ యార్డ్‌లో పనిచేస్తున్న 372 మంది ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులను రెగ్యులర్ చేసేలా కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ ఈ సమస్యపై యాజమాన్యంతోనూ రక్షణ శాఖతోనూ సంప్రదింపులు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్ర మంలో పెద్ద సంఖ్యలో ఎల్ అండ్ ఎం సీరీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బీచ్ పరిశుభ్రతలో ఎస్‌ఎఫ్‌ఎస్ ఎన్‌సీసీ క్యాడెట్లు

విశాలాంధ్ర -విశాఖ సిటీ: స్వచ్ఛ భారత్‌లో భాగంగా దేశంలో అన్ని జలాశయాలను శుభ్రం చేయాలని ఎన్‌సీసీ కార్యక్రమాల్లో భాగంగా భాగంగా 2వ ఆంధ్ర బాలికల బెటాలియన్ గ్రూప్‌కి చెందిన ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు ఆదివారం బీచ్ పరిసరాలను శుభ్రపరిచారు. సుమారు 100 ఎన్‌సీసీ క్యాడెట్లు పునీత్ సాగర్ అభియాన్‌లో పాల్గొని విశాఖ ఆర్‌కే బీచ్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి ప్రాస్టిక్ వాడకం ఆపేద్దాం -భూమిని కాపాడుదాం అనే అంశాన్ని నాటక రూపంలో ప్లాస్టిక్ రహిత అవగాహన ప్రజలలో కల్పించారు. తరువాత ఎస్ ఎఫ్ ఎస్ పాఠశాల పరిసర ప్రాంతాలలో స్వచ్ఛ పక్వాడ అనే పేరుతో శుభ్రం చేసారు. రెవరెండ్. ఫాదర్ పి.మనోజ్ కుమార్ పర్యవేక్షణలో ఎస్ ఎఫ్ ఎస్ పాఠశాల అసోసియేషన్ ఎన్‌సీసీ ఆఫీసర్ అచ్చి వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు.

కార్పొరేట్లకు అనుకూలంగా మోడీ: ఏఐటీయూసీ

విశాలాంధ్ర - విశాఖ: స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిన మోడీకి దేశ భక్తి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి డాక్టర్ బూసి వెంకటరావు అన్నారు. దేశ సంపదను కార్పోరేట్‌లకు దారాదత్తం చేసే విధానాలకు వెంటనే స్వస్తి పలకాలని కోరారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 906 రోజులుగా నడుస్తున్న ఉక్కు పరిరక్షణ దీక్ష శిబిరంలో ఆదివారం ఏఐటీయూసీ ఫార్మా, హిందూజా కార్మిక సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కును అమ్మేయాలని ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు, కార్మికులు మూడేళ్లుగా చేస్తున్న పోరాట ఫలితంగా ఒక్క అంగుళం కూడా ముందుకు వెళ్ళలేక పోయారన్నారు.

ఈ కార్యక్రమంలో ఫార్మా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యాంజనేయ, ప్రధాన కార్యదర్శి మతల అర్జున్, చుక్కా శ్రీనివాసరావు, జి తిరుపతి రావు, పిలక అప్పల రెడ్డి, సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు బాసటగా మత్స్యకారులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆదివారం 19వ వార్డు పెద్ద జాలారిపేట లో కార్పొరేటర్ నొల్లి నుకరత్నం, బైరెడ్డి పోతన్న ఆధ్వర్యంలో చంద్రబాబుకు బాసటగా మత్స్యకారులు సముద్రంలో బోట్లుపై వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. కార్పొరేటర్ నొల్లి నుకరత్నం మాట్లాడుతూ మత్స్యకారులకు సంక్షేమం, అభివృద్ధి టీడీపీ పాలనలోనే జరిగిందని, హౌసింగ్ నిర్మాణం, పట్టాల పంపిణీ కార్యక్రమం కూడా టీడీపీ హయాంలోనే జరిగిందన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుని పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం చాలా బాధాకరమన్నారు. జోన్ 1 మీడియా కో-ఆర్డినేటర్ బైరెడ్డి పోతన్న మాట్లాడుతూ వైఎస్సార్ ప్రభుత్వ నిరంకుశ విధానాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అన్నారు. ఈ కార్యక్ర మంలో మత్స్యకార నాయకుడు జి.వి.రామచంద్రరావు, కార్పొరేటర్ నొల్లి నుకరత్నం, తెడ్డు రాజు, దోడ చిరంజీవి, పిల్లా నూకన్న, ఒలిశెట్టి చిన్న ఎల్లయ్య, ఒలిశెట్టి సత్యారావు, పొట్టి అప్పన్న, వాడమదుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వైసీపీ పెద్ద పీట

ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ పెదపాటి

విశాలాంధ్ర - యస్.రాయవరం: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు పెద్దపీట వేశారని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ పెదపాటి అమ్మాజీ అన్నారు. ఆదివారం మండలంలోని అడ్డురోడ్డు తన నివాస వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళా బిల్లును పార్లమెంటు ఆమోదించడం ఎంతో అభినందనీయమని అన్నారు. 33% మహిళలకు చట్టసభల్లో అవకాశం కల్పించడం ద్వారా ఎందరో మహిళలకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కలుగుతుందని అన్నారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లోని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 50% పైగా అన్ని పదవుల్లోని మహిళలకు అవకాశం కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. ఈ చట్టాన్ని తీసుకొచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి మద్దతు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వానికి మహిళలు తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని వెల్లడించారు.

చట్టం ఎవరికి చుట్టం కాదు

మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు

విశాలాంధ్ర - పాయకరావుపేట: చట్టం ఎవరికి చుట్టం కాదని, తప్పు చేస్తే ఎంతటి వారి కైనా శిక్ష తప్పదని మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు అన్నారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అవినీతికి పాల్పడ్డారు కాబట్టే ఎఫ్ఐఆర్ లో ఆయన పేరు ఉందన్నారు. హౌస్ అరెస్టు చేసుకోమనడం, గవర్నర్ కి చెప్పలేదు అనడం సరి కాదన్నారు. ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తిని అరెస్ట్ చేయాలంటే స్పీకర్ కి సమాచారం అందజేస్తే సరిపోతుందని, స్పీకర్ అనుమతి కూడా అవసరం లేదని తెలిపారు. జైలులో సదుపాయాలు కోసం చంద్రబాబు అడగటం విడ్డూరమన్నారు. చంద్రబాబు నాయుడు కట్టించిన జైల్లో సదుపాయాలు లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. హత్య కేసులో శిక్ష పడి జైల్లో ఉన్న తాను ఏనాడు సదుపాయాలు కోరలేదన్నారు. ఇక్కడున్న కేసులే కాకుండా, చంద్రబాబు నాయుడు చేసిన అవినీతికి మరికొన్ని కేసుల్లో ఇరుక్కునే అవకాశం ఉందని చెంగల వెంకట్రావు తెలిపారు.

ఘనంగా లూథరన్ మిషన్ వార్షికోత్సవం

విశాలాంధ్ర - అరకులోయ: మండల పరిధిలో గల బెంజిపూర్ గ్రామ సమీపంలో ఉన్న లూధర్ మిషన్ మినిస్ట్రీ 30వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అరకులోయ లూథరన్ మిషన్ బాధ్యతలు స్వర్గీయ రెవ అల్లో కుమార్ పాత్రో నుండి స్వీకరించిన 30వ వార్షికోత్సవ స్తుతి, కృతజ్ఞత ఆదివార ఆరాధన కార్యక్రమం పరిశుద్ధ మేరీ లూథరన్ దేవాలయం నందు అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రెవ బి.ఇ.సంజీవ్ కుమార్ మాట్లాడుతూ 30 సంవత్సరాలు తోడుగా ఉండి లూథరన్ సంఘములు స్థాపించుటకు, లూథరన్ ప్రార్థన మందిరములు నిర్మించుటకు సహాయ సహకారములు అందించిన తోటి పాస్టర్లకు, సంఘ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ పెద్దలు శాంతి భూషణ్ రాజ్, కిల్లో నారాయణ, కిల్లో రాజు, ప్రధాని అశేరు మాస్టర్, డోంబుర్ధార్ మాస్టారు, గుండు మాస్టారు, బాబ్జి మాస్టర్, శేఖర్ మాస్టర్, సునీత టీచర్, సరస్వతి టీచర్, సంజీవ్ ప్రసాద్ లీలావతి దంపతులు, దొర మనోహర్ కావేరి, అప్పలరాజు జాన్ మేరీ, యువ నాయకులు అనంచంద్, ప్రతాప్, రాజా ప్రసన్న, ఆర్య వర్ధన్, నవీన్, ప్రేమ్, ఆలోక్, సంజయ్, మేరీ మణి, వేరొనిక, లిజ్జా, హర్ష, అభి, శ్రేయష్, విక్కీ షైనీ మరియు సుకురుగూడ, కరసాలగూడ, పిట్టమామిడివలస బెంజిపూర్ సంఘస్థులు పాల్గొని దేవునికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సూర్యనారాయణకు ఘన నివాళులు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని గిడిజాల పంచాయతీ దిబ్బడి పాలెం గ్రామానికి చెందిన ఆనందపురం మండల ఉపాధ్యక్షులు పాండ్రంకి శ్రీను పెదనాన్న వైసీపీ సీనియర్ నాయకులు కోరాడ ముసలినాయుడు తండ్రి కోరాడ సూర్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. భీమిలి నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జ్ ముత్తంశెట్టి మహేష్‌తో పాటు పలువురు నాయకులు, స్నేహితులు, బంధువులు కోరాడ సూర్యనారాయణ (65) భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, బొట్ట రామకృష్ణ, మహంతి శివాజీ, సర్పంచులు కలిమి గంగరాజు, శినగం ఎర్రయ్య, మండల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు సంతాపం తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు ఐదుగురు విద్యార్థులు

విశాలాంధ్ర - కే.కోటపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు హైస్కూల్ పీడీ పి.లక్ష్మి తెలిపారు. ఈనెల 22, 23 తేదీల్లో నియోజకవర్గ స్థాయిలో జరిగిన అండర్ 14, అండర్ 17 విభాగంలో ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయికి అర్హత సాధించారు. అండర్ 14 విభాగంలో అథ్లెటిక్స్‌లో ప్రవీణ్, కబడ్డీలో సాగర్, కో కో లో జె.హారిక ఎంపిక కాగా అండర్ 17 విభాగంలో జి.అనిత, పి.భువనేశ్వరిలు జిల్లాకు ఎంపికైనట్లు పీడీ తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు ఎస్వీ పద్మావతి అభినందించారు.

సిల్వర్ ఓక్ మొక్కల పంపిణీ

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండలంలోని పోతంగి పంచాయతీ ఉపాధి కూలీ రైతులకు సిల్వర్ ఓక్ మొక్కలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రంగారావు మాట్లాడుతూ ఇక్కడి పంచాయతీలోని 32 మంది రైతులకు గాను 22 వేల నాలుగు వందల సిల్వర్ మొక్కలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎంజీఎన్‌ఆర్‌ఇజీఎస్ శాఖ నుండి కల్పిస్తున్న ఈ అవకాశాన్ని గిరి రైతులు వేయించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పోతంగి పంచాయతీ వార్డు మెంబర్ యస్.కాంతారావు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎస్.శాంతకుమారి, టి.దలిమ్మ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రంలో గంటా

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి నియోజకవర్గం గొల్లల తాళ్ళవలసలో గల భరోసా లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రాన్ని టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సతీమణి గంటా శారదమ్మ, కుమారుడు గంటా రవితేజ సందర్శించారు. సంరక్షణ కేంద్రంలో పిల్లలకు భోజనం, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఆశ్రమంలో ఉన్న పిల్లలలో ఒకరైన శంకర్ 5 ఏళ్ల పిల్లవాడిని దత్తత తీసుకొని ఆ అబ్బాయికి ఉద్యోగం వచ్చినంత వరకు బాధ్యత మాది అని భరోసా ఇచ్చారు. ఇన్ని మంచి కార్యక్రమాలు చేస్తున్న వెంపాడ వెల్ఫేర్ సొసైటీ శ్రీనివాస్ రెడ్డిని అభినందించారు.

వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలకు వైభవంగా అంకురార్పణ గావించారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు మేళ తాళాలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు రాత్రి పుట్ట బంగారం తీసుకొచ్చి పూజలు నిర్వహించిన అనంతరం అంకుర్పారణ చేశారు. ఆదివారం నుంచి గురువారం వరకు ఆలయంలో పలు ఆర్జిత సేవలతో పాటు, నిత్యకల్యాణాలను, ఏకాంత సేవలను నిలిపి వేశారు. పవిత్రోత్సవాలు జరుగుతున్న ఐదు రోజుల పాటు సాయంత్రం గం.7 ల తరువాత భక్తులకు సింహాద్రినాధుని దర్శనములు లభించవని వైదిక పెద్దలు, కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు.

ఆశా కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

విశాలాంధ్ర - అనంతగిరి: అనారోగ్యంతో ఆశ కార్యకర్తల చింతా నీలమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. అనంతగిరి మండలం కొత్తూరు పంచాయతీ లక్ష్యంపురం గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త చింతా నీలమ్మ అనారోగ్య కారణంతో ఇటీవలే మరణించడంతో కొత్తూరు సర్పంచ్ సారా సీతయ్య, ఆరోగ్య సిబ్బంది అయినా ఏఎన్ఎం లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణరావు, ఆశ కార్యకర్తలు సన్యాసమ్మ, నూకాలమ్మతో కలిసి ఆమె కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేశారు.

టీడీపీ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన

విశాలాంధ్ర - పెదగంట్యాడ: తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై పెట్టిన తప్పుడు కేసులకు నిరసనగా నెల్లిముక్కు సెంటర్‌లో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి పిలుపు మేరకు 75వ వార్డు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యములో అర్ధనగ్న ప్రదర్శన ద్వారా తమ నిరసనను తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పుడూ లేని ఫ్యాక్షన్ పాలన నడుస్తుంది అని, ఇది ఎంతో కాలం సాగదని, తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని తాను దొచుకున్నట్లే అందరినీ దొంగలని చేద్దామని చూస్తున్న ఈ ముఖ్యమంత్రికి రానున్న ఎన్నికలలో ప్రజలు సరియైన గుణపాఠం చెబుతారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వార్డు అధ్యక్ష కార్యదర్శులు నమ్మి అప్పారావు, దోమ్మేటి పెరుమాళ్ ములకలపల్లి పెంటయ్య, శ్రీముసిరీ శ్రీనివాసరావు, టేకేటి పెంటయ్య, అండి బోయిన రాము నాయుడు, బస అప్పల రెడ్డి, కాకినాడ అప్పల రాజు, ఏళ్ళంకి రమణ, అప్పారావు, ముద్దర్తి సాంబ శివరావు, ముద్దర్థి మణికంత, పీత రమణ, సింహాచలం, వంగలపూడి అప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.

గోవాడ సహకార చక్కెర కర్మాగారాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

విశాలాంధ్ర - చోడవరం: రాష్ట్రంలోని సహకార చక్కెర మిల్లులు అన్నింటిలో అన్ని రంగాల్లో అగ్ర పథాన నిలిచి,1962లో ప్రారంభమైన ది.చోడవరం సహకార చక్కెర కర్మాగారం(గోవాడ) పరిస్థితి ప్రస్తుతం అన్ని రంగాల్లో అత్యంత దయనీయంగా మారిందని ఏ.పి.రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆరోపిస్తున్నారు. పూర్వపు పాలకమండళ్లు, యాజమాన్యం పంచదార, మొలాసిస్ అమ్మకాల్లో అవినీతి, నిర్వహణ లోపాలు వెరసి సభ్య రైతులు, కార్మికుల పాలిట శాపంగా మారి, పేమెంట్లు చెల్లించలేని స్థాయికి దిగజారిందన్నారు. అన్ని విధాలా రైతాంగాన్ని ఆదుకుంటాం అని చెబుతున్న అధికార ప్రభుత్వాలు ఆర్థిక సహకారం అందిస్తేనే కానీ ఈ ఏడాది చెరకు గానుగాట ఆడలేమని ఫ్యాక్టరీ యాజమాన్య వర్గాలు భోరున విలపిస్తున్నాయి. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని సుమారు 220 గ్రామాల్లో 25 వేల మంది సభ్య రైతు కుటుంబాలు, వేయికు పైగా కార్మికులు కలిపి సుమారు లక్షకు పైగా చెరకు రైతులు గోవాడ సుగర్స్ పై ఆధారపడి వున్నారు. గడిచిన 2022-23 క్రషింగ్ సీజన్లో 2 లక్షల 21 వేల 246 మెట్రిక్ టన్నుల చెరుకు గానుగాడగా 9.01 శాతం రికవరీతో, లక్షా 88 వేల 124 క్వింటాళ్ల పంచదార ఉత్పత్తి జరిగింది. గతేడాది నిర్వహణ లోపంతో మిల్ టర్బైన్ లు సక్రమంగా పనిచేయక పోవడం, కొత్తవి కొనుగోలులో లక్షలాది రూపాయలు నష్టంతో బాటు, విద్యుత్ ఉత్పత్తి నిలిపివేత తో ఫ్యాక్టరీ ఆదాయానికి గండి పడింది. 2022-23 సీజన్లో చెరకు సరఫరా చేసిన సభ్య రైతులకు మొదటి విడతగా రూ. 2500లు చొప్పున చెల్లించగా, రూ.321.25 పై.లు బకాయిలుండగా, గేట్ ఏరియా రైతులకు అదనంగా 50 రూ.లు చెల్లించాలి, వెరసి సభ్య రైతులకు చెల్లించాల్సినవి సుమారు 9 కోట్లు పైనే. కార్మికుల జీత భత్యాలకు 3 కోట్లు పైనే చెల్లించాలి, వెరసి ఫ్యాక్టరీ చెల్లింపుల బకాయిలు రూ.12 కోట్లు పై మాటే. ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తైనే తప్ప ఈ ఏడాది ఫ్యాక్టరీ మనుగడ సాగించడం కష్టం. ఇప్పటికే సకాలంలో చెరకు పెమెంట్లు చెల్లించక పోవడంతో, చెరకు సాగు విస్తీర్ణ0 బాగా తగ్గిపోయింది.

2002 - 03లో పాక్షికంగా ఆధునీకరించి, 12.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కి కో-జనరేషన్ ప్లాంట్ ఏర్పాటుతో కొంత వరకు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నను, యంత్రాలు పాత బడడంతో ప్రతీ ఏడాది మరమ్మత్తుల కే కోట్లాది రూపాయిలు ఖర్చు చేస్తున్నారు. వీటి పుణ్యమా అని ఓవర్ ఆయిలింగ్, మరమ్మత్తుల పేరిట లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయిన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా గోవాడ చక్కెర ఫ్యాక్టరీను ఆదుకోవాలని కార్మిక, కర్షక సంఘాలు, ఏ.పి. జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 29 న జరుగనున్న ఫ్యాక్టరీ మహాజన సభ లో అధికార ప్రభుత్వాలు, ఫ్యాక్టరీ యాజమాన్య నిర్ణయాలు ఎలా వుంటాయో వేచి చూడాల్సిందే ...

వైసీపీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడుదాం

విశాలాంధ్ర - చింతపల్లి :- రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం సాగిస్తున్న నిరంకుశ పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని ఆ పార్టీ అరకు పార్లమెంటు కార్య నిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి,

మండల ఉపాధ్యక్షుడు కిముడు లక్ష్మయ్య, గంగరాజులు అన్నారు. తెదేపా జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ మండలంలోని చౌడుపల్లి పంచాయతీ కేంద్రంలో అరకు పార్లమెంటు కార్యానిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలోనూ అదే విధంగా పెదబరడ పంచాయతీ చింతలూరు గ్రామంలో ఉపాధ్యక్షుడు కిముడు లక్ష్మయ్య ఆధ్వర్యంలోనూ, ఏజెన్సీ అన్నవరం గ్రామంలో గంగరాజు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో వారు మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి సంస్థకు సంబంధించి క్యాబినెట్లో ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలను తప్పుబడుతూ,

ప్రతిపక్షాలను గొంతు నొక్కే కార్యక్రమంలో భాగంగా కక్షపూరితంగా ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయడం వైకాపా ప్రభుత్వ నిరంకుసత్వపాలనకు నిదర్శనం అన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థకు సంబంధించి వాస్తవాలను టిడిపి అధికారిక వెబ్సైట్ లో ఉంచిందని, తద్వారా. ప్రజలు వాస్తవాలు తెలుసుకుంటున్నారని, ప్రజలకు సేవలు అందించడంలో మచ్చలేని చంద్రుడిగా పేరొందిన చంద్రబాబు నాయుడు రిమాండ్ నుండి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని, రానున్న ఎన్నికలలో రాష్ట్రంలో టిడిపి జెండా ఎగరడం ఖాయమని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. అందుకు టిడిపి శ్రేణులు సంసిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పలుచోట్ల అన్నసమారాధనలు

విశాలాంధ్ర - హుకుంపేట: మండల కేంద్రంలో గల శతకం పట్టు వద్ద వినాయక చవితి సందర్భంగా సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ, ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆదివారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా పలువురు భక్తులు వినాయకుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సమారాధన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ అన్న సమారాధన కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన గ్రామంలోని ప్రతి ఒక్కరికి ఆమె కృత జ్ఞతలు తెలిపారు. ఇంత మంచి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గ్రామస్తులు ఎంపీటీసీ నాయిని రజిని, జిల్లా యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, టిడిపి మండల మహిళా కార్యదర్శి ఎస్.సూర్యకాంతం, జగదీష్, గ్రామస్తులు సుధాకర్, కాసుల కృష్ణ, గోవింద్, రమణ, శివాజీ, రాజా, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 40వ వార్డు పరిధి ఏకేసి కాలనీ ఫ్రెండ్స్ అసోసియేషన్ యూత్ ఆధ్వర్యంలో గొప్ప

అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, గంటా వర్మ, వరపల మహేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మహిళలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆనందపురం: ఆనందపురం మండలం బంటుపల్లి వారి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కాలనీలో ఆదివారం యువసేన యూత్ ఆధ్వర్యంలో శ్రీ వరసిద్ధి వినాయక అన్నసంతర్పణ

కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సుమారు 1500 మంది భక్తులు విచ్చేసి ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు తీసుకొని వినాయక స్వామి ఆశీస్సులు పొందారు. యువసేన యూత్ గ్రామ పెద్దలు, నాయకులు అందరి సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం జరిపించామని వినాయక ఉత్సవ కమిటీ వారు తెలిపారు.

చింతపల్లి: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని చింతపల్లి, జీకే వీధి మండల కేంద్రాలలోనే గాక, గ్రామ గ్రామాన, పురవీధులు ఏర్పాటుచేసిన వినాయక ప్రతిమలకు భక్తులు ఘనంగా పూజలు నిర్వహించడంతోపాటు అన్న సమారాధనలు నిర్వహించి మేళా తాళాల నడుమ భారీ ఊరేగింపు నిర్వహించి వినాయక నిమజ్జనాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని సంత మార్కెట్ సమీప జిసిసి డిఆర్ డిపో వద్ద ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం కు సంబంధించి, అదేవిధంగా స్థానిక జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య ఇంటి సమీపంలో ఆ ప్రాంత ఉద్యోగులు అంతా కలిసి ఏర్పాటుచేసిన విగ్నేశ్వరుల మండపాల వద్ద, మెట్ట బంగ్లా జిసిసి గోదాము సమీపంలోనూ,

మైలకూలి వీధి, ముఠా దారి వీధి, పెద్ద పైపు వీధి, నెయ్యిల వీధి, గుర్రాల వీధి లలో నెలకొల్పిన వినాయక ప్రతిమలకు గడచిన ఆరు రోజులుగా పూజా కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు మండల కేంద్రంలోని అన్ని వీధుల విగ్నేశ్వరుల ప్రతిమలను శనివారం డీజే లు, కోలాటాలు, సాంప్రదాయ దింసా నృత్యాలు నడుమ ఘనంగా ఊరేగించి నిమజ్జన కార్యక్రమం పూర్తి చేశారు. ఈ కార్యక్రమాలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెందుర్తి: జీవీఎంసీ 96 వార్డు పరిధిలోని పలు ప్రదేశాలలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం పలు మండపాలలో అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. వార్డు పరిధిలోని పాత పెందుర్తి, దొగ్గవానిపాలెం, రాతి చెరువు, పెందుర్తి కూడలిలో నిర్వాహకులు ఏర్పాటుచేసిన

భారీ అన్న సమారాధన కార్యక్రమాలను మాజీ కార్పొరేటర్ బీసీ సంఘాల రాష్ట్ర నాయకుడు శరగడం చిన అప్పలనాయుడు ప్రారంభించారు. ఆయా వేదికల వద్ద ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ప్రజల్లో భక్తి భావం పెరిగిందని, ఇది మంచి పరిణామం అని పేర్కొన్నారు. కుల మతాలకతీతంగా అందరూ కలిసి సాగాలని సూచించారు. కార్యక్రమంలో వేగి శ్రీనివాసరావు చిన్న అప్పల నాయుడు అభిమానులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనాధ పిల్లలకు రగ్గులు పంపిణీ

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండలంలోని అరకు పంచాయతీ పరిధిలో ఉన్న జైపూర్ జంక్షన్ సమీపంలో గల ప్రత్యూష అనాధ ఆశ్రమంలో గల చిన్నారులకు ధూపం ఫౌండేషన్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో బుధవారం రగ్గులు, టవల్స్, నే ఫ్ కిన్స్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధూపం ఫౌండేషన్ వ్యవస్థాపకులు సత్యం మాట్లాడుతూ 2015 నుంచి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని మన్య ప్రాంతంలోని నిరుపేద గిరిజన కుటుంబాలకు తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా తను విద్యుత్ శాఖలో ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తూ గిరిజన ప్రాంతంలోని అనేక సేవలు అందించడం జరిగిందన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం 18 ఏళ్లుగా ఫౌండేషన్ స్థాపించి నిరుపేద గిరిజనులకు అనేక సేవలు అందించడం జరిగింది అన్నారు. అమాయకగిరి పుత్రులా జీవన స్థితి గతులు అమాయక బతుకులు చూసి చలించి సేవా కార్యక్రమాలకి అంకితమయ్యానని ఆయన చెప్పారు. ఇక్కడి ప్రత్యూష అనాధ ఆశ్రమంలో ఉన్న చిన్నారులకు

ఇటువంటి కార్యక్రమం చేయడం నాకెంతో సంతోషాన్ని కలగజేస్తుందని ఆయన తెలిపారు . మన్యంతోపాటు ఒరిస్సా రాష్ట్రంలోని కూడా సేవా కార్యక్రమాలు చేసేందుకు సంసిద్ధమవుతు న్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ డైరెక్టర్ ఏ.వెంకట్రావు, ధూపం ఫౌండేషన్ ప్రతినిధులు శంకర్ శర్మ, శోభారాణి, ప్రత్యూష అనాధాశ్రమ నిర్వాహకులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - దేవీపట్నం: మండలంలోని అంగుళూరు సమీపంలోని పోలవరం ప్రాజెక్టు మెగా క్యాంపు పక్కన కాలువలో 35 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని దేవీపట్నం ఎస్సై కేవీ నాగార్జున తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దేవీపట్నం ఎస్ఐ కెవి నాగార్జున తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని గుర్తించి పంచానామా చేసి కేసును దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు. మృతుడు ఆనవాళ్లు వైట్ కలర్ బనేన్, చేతికి పసుపు కలర్ ఫ్రెండ్షిప్ బ్రాండ్ ధరించి ఉన్నట్టు పేర్కొన్నారు .

నాడు - నేడు పనులకు గ్రహణం

అసంపూర్తి నిర్మాణాల నడుమ ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు

లంబసింగి ప్రభుత్వ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శ్రీధర్

విశాలాంధ్ర - చింతపల్లి :- నిధులు మంజూరు అవుతున్నా లంబసింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాడు - నేడు పనులు పునాదుల దశలోనే దర్శనమిస్తున్నాయని ఆ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సరమండ శ్రీధర్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆంధ్ర కశ్మీర్ గా పేరుందిన పర్యాటక ప్రాంతమైన లంబసింగి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంబంధించి నాడు - నేడు పనులకై రెండవ దఫా (సెకండ్ స్పెల్) 62 లక్షలు మంజూరైనప్పటికీ నేటి వరకు పునాదులు తీసి ఊసలు నిలబెట్టి వదిలేసారు తప్ప పనులు ముందుకు సాగలేదన్నారు. కారణం ఏమిటని ప్రశ్నిస్తే మిగిలిన బిల్లులు రావాలని సమాధానం చెబుతున్నారన్నారు. నాడు నేడు పనులు ఈ విధంగా అసంపూర్తిగా నిలిచిపోవడానికి కారణం ప్రభుత్వ లోపమా, అధికారుల చేతకానితనమా అని ఆయన

ప్రశ్నించారు. పునాదులు తీసి అసంపూర్తిగా వదిలేయడం వలన విద్యార్థులకు ప్రమాదాలు సంభవించే పరిస్థితులు కనబడుతున్నాయన్నారు. నాడు నేడు కార్యక్రమం పట్ల గొప్పలు చెప్పుకుంటున్న వైకాపా ప్రభుత్వం ఇటువంటి అసంపూర్తి నిర్మాణాలను చూసైనా ప్రగల్భాలు మానాలని ఆయన హితవు పలికారు. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నిర్మల నృత్యనికేతన్ 42వ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు పరిధిలో గల ప్రఖ్యాత నృత్య కళాశాల నిర్మల నృత్య నికేతన్ 42వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ప్రిన్సిపల్ డాక్టర్ విజయ జ్యోతి, ప్రెసిడెంట్ నిర్మల మందహాస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేవుడు 90 వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ జిల్లా యువజన శాఖ అధికారి జి మహేశ్వరరావు, ది డ్యాన్స్ ఇండియా మ్యాగజైన్ ఎడిటర్ విక్రమ్ కుమార్, ఏయూ డాన్స్ ప్రొఫెసర్ ఎన్ ప్రసన్న రాధ తదితరులు పాల్గొని ప్రాచీన కలల సంరక్షణకు నిర్మల నృత్యనికేతన్ చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కళాశాలలో నాట్యం నేర్చుకోవడాన్ని గౌరవంగా భావించాలని పిల్లలు వారి తల్లిదండ్రులకు సూచించారు. ఎన్నో జాతీయ అంతర్జాతీయ అవార్డులు సాధించి తనకు తానే సాటిగా ఈ సంస్థ నిలిచిందని పేర్కొన్నారు. ఇంతటి ప్రాధాన్యత గల

కళామతల్లిని కాపాడుకోవడం మనందరి బాధ్యతని కార్పొరేటర్లు ముమ్మన దేముడు బొమ్మిడి రమణ అన్నారు. నిర్మల నృత్యనికేతన్ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం నుండి స్థలం ఇప్పించేందుకు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పిల్లల ప్రదర్శించిన నాట్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే వేదంలో పీహెచ్డీ చేసి ఉత్తరాంధ్రలో ఏకైక వ్యక్తిగా నిలిచిన వేద పండితుడిని ఘనంగా సత్కరించారు.

ఆగిపోయిన కోర్టు భవనాలు నిర్మాణం చేపట్టండి

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం న్యాయస్థానముల సముదాయంలో నిర్మాణ దశలో ఆగిపోయిన కోర్టు భవనాలను తక్షణమే నిర్మించాలని న్యాయవాదులు, కక్షిదారులు కోరుతున్నారు. హై కోర్టు జడ్జి సి.ప్రవీణ్ కుమార్ చే 2021 ఫిబ్రవరి 20న కోర్టు ఆవరణలో నూతన భవనములు నిర్మించేందుకు శంఖుస్థాపన చేశారు. కొత్త భవనములు నిర్మాణ దశలో ఆగి పోవడంతో న్యాయమూర్తులు, న్యాయవాదులతో బాటు, నిత్యం ఇక్కడకు వచ్చెడి కక్షి దారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వివిధ కేసుల పరిష్కారం కోసం చోడవరంతో బాటు పలు ప్రాంతాల నుండి హాజరవుతున్న మహిళా, పురుష న్యాయవాదులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. గతంలో నిలిచిపోయిన న్యాయ స్థానముల నూతన

భవనములు తక్షణమే నిర్మించాల్సి0దిగా కోరుతూ స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, బార్ అసోసియేషన్ సభ్యులు ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ మాధవి సుకన్యకు వినతి పత్రం అందజేశారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నూతన భవనముల పునరుద్ధరణ చేపట్టవలసినదిగా న్యాయవాదుల బార్ అసోసియేషన్, కక్షిదారులు కోరుతున్నారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జనం

విశాలాంధ్ర - దుంబ్రిగుడ: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక మండల కేంద్రంలో అల్లూరి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహానికి ఆదివారం ఘనంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పురవీధుల గుండా వినాయకుడి విగ్రహాన్ని ఘనంగా ఊరేగిస్తూ, ప్రసాదాన్ని పంచుతూ, గిరిజన సంప్రదాయమైన థింసా నృత్యాలను ప్రదర్శిస్తూ ఊరేగించి చాపరాయి జలపాతం వద్ద నిమజ్జనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి.వెంకటరావు, వినాయకుడి విగ్రహ ధాత నెమలిపురి సూర్య కుమార్ (రాజు), అల్లూరి యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుప్పెడు బాదం పప్పులతో ఆరోగ్యానికి మేలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: కార్డియోవాస్కులర్ డిసీజ్ (సీవీడీ) దాని ప్రభావం గురించి అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం, ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 29న ప్రపంచ హృదయ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచ హృదయ దినోత్సవం యొక్క థీమ్ 'హృదయాన్ని ఉపయోగించండి, హృదయాన్నితెలుసుకోండి ' అనే నేపథ్యంతో ఎమోజీరూపంలో హృదయం ఉపయోగించబడుతుంది. ధూమపానం చేయకుండటం, 5 లేదా అంతకంటే ఎక్కువ సార్లు పండ్లు కూరగాయలు తీసుకోవటం , అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్‌లో ప్రచురించబడిన ఒక అధ్యయనం ప్రకారం, ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు రోజువారీ అల్పాహారంగా 42 గ్రాముల బాదం తినడం వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. బాదం అల్పాహారంగా తీసుకోవటం వల్ల నడుము చుట్టుకొలత కూడా తగ్గుతుంది. మెరుగైన గుండె ఆరోగ్యాన్ని సాధించడంలో మొదటి అడుగు మెరుగైన ఆహార ఎంపికలు చేయడం. మీ కుటుంబానికి రోజువారీ ఆహారంలో కొన్ని బాదంపప్పులను జోడించడం మంచి అలవాటు, ఎందుకంటే అవి పోషకాలను కలిగి ఉంటాయి, ఆరోగ్యకరమైన అల్పాహారం కోసం మరియు గుండె ఆరోగ్యానికి సహాయపడతాయి.

బిజెపి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - పెందుర్తి: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినోత్సవం సందర్భంగా పెందుర్తి నియోజకవర్గంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రాము నాయుడు ఆధ్వర్యంలో పలు సేవా సాంస్కృతి కార్యక్రమాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఈనెల 17 నుండి వచ్చే నెల రెండో తేదీ వరకు రోజుకో ప్రాంతంలో విభిన్న సేవా కార్యక్రమాలు రామునాయుడు నిర్వహిస్తున్నారు. ఆదివారం స్థానిక లైన్స్ క్లబ్ లో రక్తదాన శిబిరం నిర్వహించి 40 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. నగరంలోని రాంనగర్ లైన్స్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో స్థానిక యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ రత్న శేఖర్ సభ్యులు అచ్చయ్య రాంబాబులతోపాటు బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో మొదలైన రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్, రెజ్లింగ్ పోటీలు పోటీలు

విశాలాంధ్ర - మధురవాడ : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం వేదికగా ఆదివారం రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్, రెజ్లింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా బాస్కెట్ బాల్ అధ్యక్షులు, ఎన్.ఐ.ఎఫ్.ఎన్. సి.ఈ.ఓ, సునీల్ మహంతి, విశాఖ జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ చైర్మన్,రిటైర్డ్ ఎడిషనల్ ఎస్పీ టి.ఎస్.ఆర్ ప్రసాద్,రాష్ట్ర గ్రాప్లింగ్,రెజ్లింగ్ సంఘ అధ్యక్షులు ఎం.సురేంద్రరెడ్డి, సి.ఐ.బాలకృష్ణ,హజరత్ ముక్తియార్ అలీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.డి. అహ్మద్, విచ్చేసారు. రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్, రెజ్లింగ్ పోటీలకు రాష్ట్రంలో 13జిల్లాల నుంచి 250మంది బాల, బాలికలు ఈ పోటీలకు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్ బాల్ అధ్యక్షులు సునీల్ మహంతి మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో క్రీడలు దైనందిక జీవితంలో దోహద పడతాయని అన్నారు. విద్యార్థిదశలో క్రీడాకారులు వాస్తవిక దృక్పథం, లక్ష్యం, నాలెడ్జ్ ప్రతీ యువతీ యువకులకు అవసరమని, అపజయల నుంచి పాఠం నేర్చువాలని, నిరాశ, నిశ్పృహ వంటి వాటిని విడనాడాలని, గొప్పవ్యక్తులు చెప్పే మాటలు విని ప్రేరణ పొందాలని, విద్యార్థి దశ నుంచే ఆటల పట్ల ఆసక్తిని పెంపొందించుకొని, నైపు ణ్యంతో క్రీడల్లో రాణించాలన్నారు. టి.ఎస్.ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు, మానసిక ఉల్లాసం వృద్ధి చెందు తుందన్నారు. సాంప్రదాయకమైన ఆటలు ప్రపంచ గుర్తింపు గల క్రీడల్లో ప్రావీణ్యము సంపాదిస్తే, పేరు, ప్రతిష్ఠలతో పాటు మంచి ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయని తెలిపారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోను ఆయా క్రీడల్లో విద్యార్థులు రాణిస్తున్నారని అన్నారు. అనంతరం ముఖ్య అతిథులు గ్రాప్లింగ్, రెజ్లింగ్ క్రీడలో పాల్గొంటున్న క్రీడాకారులకు అభినందనలు తెలుపుతూ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజబాబు, పాఠశాల కమిటీ చైర్ పర్సన్ బుడుమూరి మీనా, అనూష కేటరింగ్స్ పోతిన ప్రసాద్, ఏపీ గ్రాప్లింగ్ అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి పేడాడ మురళీ, జిల్లా అధ్యక్షులు బగాది జగదీశ్వర రావు, కోశాధికారి బి.రామచంద్రరావు, ఫిజికల్ డైరెక్టర్ పెంటకోట రాము పాల్గొన్నారు.

ఓ వృద్ధురాలిపై 16 ఏళ్ల బాలుడు అత్యాచారం

విశాలాంధ్ర - రావికమతం : ఒంటరిగా నిద్రిస్తున్న ఓ వృద్ధురాలిపై 16 ఏళ్ల బాలుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. శనివారం రాత్రి రావికమతం మండలంలోని జెడ్ కొత్తపట్నం గ్రామంలో జరిగిన ఈ దారుణ సంఘటనపై కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ అహ్మద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాధితురాలికి భర్త, పిల్లలు ఎవరూ లేకపోవడంతో గ్రామంలో రామకోవెల సమీపంలో గుడిసె వేసుకొని జీవనోపాధి సాగిస్తోంది. అయితే అదే గ్రామానికి చెందిన 16ఏళ్ల యువకుడు శనివారం రాత్రి 8గంటల ప్రాంతంలో వృద్ధురాలిపై దాడి చేసి అత్యాచారానికి ఒడిగట్టాడని సీఐ తెలిపారు. సంఘటన జరిగిన సమయంలో భారీ వర్షం పడుతుండడంతో ఆ వృద్ధురాలు కేకలు వేసినప్పటికీ ఎవరికీ వినిపించలేదు. అర్ధగంట తర్వాత వృద్ధురాలి కేకలు మళ్లీ వినిపించడంతో చుట్టుపక్కల వారు రావటం గమనించిన ఆ యువకుడు పరారైపోయినట్టు విచారణలో తేలిందన్నారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలాన్ని పరిశీలించి, తక్షణమే వృద్ధురాల్ని వైద్య సేవల నిమిత్తం విశాఖలోని కేజీహెచ్కు తరలించామని సీఐ తెలిపారు. వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడిన బాలుడ్ని ప్రస్తుతం తన తల్లిదండ్రుల సంరక్షణలోనే ఉంచామని, విచారణ పూర్తయిన వెంటనే విశాఖలోని బాల నేరస్తుల కోర్టుకు తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ. పదివేలు విరాళం

విశాలాంధ్ర - చీడికాడ : మాడుగుల నియోజకవర్గం చీడికాడ మండలం చిన్న కోణం గ్రామం లో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి వారి దేవాలయం నిర్మాణం కొరకు మాడుగుల నియోజకవర్గ జనసేన నాయకులు రాయపరెడ్డి కృష్ణ గారు రూ. 10,000/- చిన్న కోణం జనసేన నాయకులు మురికితి అప్పారావు ఆధ్వర్యంలో ఆలయనిర్మాణ కమిటీకి విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మురికితి అప్పారావు, యాళ్ల ప్రసాద్, వరహాలు నాయుడు, పరదేశి నాయుడు, అప్పారావు, అప్పలకొండ శ్రీను, సంతోష్, కార్తీక్, పోతురాజు మరియు జన సైనికులు పాల్గొన్నారు.

మధురవాడ పిఎసిఎస్ పరిరక్షించాలి

విశాలాంధ్ర - కొమ్మాది : మధురవాడ పిఎసిఎస్ పరిరక్షించాలని భీమిలి నియోజక వర్గం శాసనసభ్యులు, మాజీ మంత్రివర్యులు లిమాన్య్రశీ.అవంతి శ్రీనివాసరావు గారిని మధురవాడ పిఎసిఎస్ సభ్యులు, మధురవాడ అఖిలపక్ష రాజకీయ నాయకులు మరియు మధురవాడ పెద్దలు కలిసి ఆవరణలో బంకు ఏర్పాటుకు సరికాదని అన్నారు. పిఎసిఎస్ పరిరక్షించి క్రెడిట్ సొసైటీగా మార్చాలని కోరారు. దీనిపై శ్రీ అవంతి శ్రీనివాస్ గారు వెంటనే స్పందించి సంబంధించిన అధికారులతో మాట్లాడి పిఎసిఎస్ బిల్డింగు కూల్చివేతని నిలిపి వెయ్యాలని విశాఖపట్నం జిల్లా కోపరేటివ్ అధికారికి ఆదేశించారు.

ఘనంగా అన్న సంతర్పణ

విశాలాంధ్ర - చీడికాడ : మండలంలోని కోణం గ్రామంలో వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భారీ అన్న సమారాధన అనంతరం సాయంత్రం అనుపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి సర్వారావు సంతోష్ మొల్లి లోకేష్ నవీన్ దాలిపోయిన దేవుడు కంచుమండ తదితరులు పాల్గున్నారు అలాగే చీడికాడలో గుళ్ళేపల్లి బొడ్డు వారి కుటుంబ సభ్యులు వినాయక మండపం వద్దభారీ అన్నసమారాధన నిర్మించారు అలాగే బైలుపూడి సేరుపాలెం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించరు.

చంద్రన్నకు అండగా తెలుగు తమ్ముళ్లు కొవ్వొత్తులతో నిరసనలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : జైలు నుంచి విడుదల అయ్యేంత వరకు నిరసనలు కొనసాగిస్తాం రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం (జగన్) నవ్యాంధ్రప్రదేశ్ సృష్టికర్త, టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ గాజువాక నియోజకవర్గం 87వ పరిధిలో రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం (జగన్) గారు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకో పోవాలి బాబు రావాలి అంటూ నినాదం చేస్తూ, రాజకీయ కక్షతోనే చంద్రబాబుని అరెస్టు చేశారని, రానున్న రోజులో ప్రజలు ఈ సైకో పాలనకు చరమగీతం పాడుతారాని, బాబు గారు విడుదల చేసేంతవరకు ఈ నిరసనలు ఆగవు అని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్ రాజ్, విజయరామరాజు, సత్తిబాబు, కన్నారావు, కల్లేపల్లి శ్రీనివాస్ వర్మ,రమణ మూర్తి, గెద్దాడ రాంబాబు, శాంతారావు, భాస్కరరావు, గెద్దాడ అప్పారావు, పైడిరాజు, మురళి, పోతల కృష్ణ,భాగ్యలక్ష్మి, కనక సత్య, కదుపుట్ల శ్రీను,నూకరాజు, దేముల్లు, కె.శ్రీనివాసరావు, పెంటారావు, దొర,జి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు క్షేమం కోరుతూ హెూమం చేపట్టిన ఏ.పి.బ్రాహ్మణ జిల్లా మాజీ కో ఆర్డినేటర్

విశాలాంధ్ర - చోడవరం : మాజీ సి.ఎం. చంద్రబాబు క్షేమం కోరుతూ మండలంలోని గవరవరం ప్రాచీన శివాలయంలో ఏ.పి.బ్రాహ్మణ సంఘం జిల్లా మాజీ కో ఆర్డినేటర్ కొమ్మన మంచి నరసింహమూర్తి ఆదివారం వేద పండితుల చేత ప్రత్యేక హెూమాలు జరిపించారు. ఈ సందర్భంగా టి.డి.పి. నాయకుడు కె.ఎన్.మూర్తి మాట్లాడుతూ రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు క్షేమంగా తిరిగి రావాలని, శత్రు బాధల నుండి విముక్తి కలగాలని పరమ శివుని ప్రార్ధిస్తున్నామన్నారు. అధికార ప్రభుత్వం అక్రమ అరెస్టులు మానుకోవాలి అన్నారు. అధికార వై.సి.పి. అభిమానులతో సహా రాష్ట్ర ప్రజలు అందరూ తమ నాయకుడు చంద్రబాబు అరెస్టును ఖండిస్తున్నారు అని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అనుచిత వైఖరులు బహిర్గతం అవుతున్నాయని, ఇప్పటికైనా ప్రజాదరణ పాలన అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి అని కోరారు.

ఆచార్యులను అభినందించిన అధికారులు

విశాలాంధ్ర - విశాఖ సిటీ : రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఆచార్యులుగా పురస్కారాలు సాధించిన ఆచార్యులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. తన కార్యాలయంలో ఆచార్య ఎస్.కిషోర్ బాబు, ఆచార్య పి.శ్యామల, ఆచార్య సి.వి నాయుడు, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య కె.రమాసుధ, ఆచార్య డి.లలిత భాస్కరిలను సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సిల్వర్ ఓక్స్ స్ట్రీట్ స్టోర్‌కి అపూర్వస్పందన

విశాలాంధ్ర - విశాఖ సిటీ : నిరుపేద విద్యార్థులకు పలు వస్తువులు ఉచితంగా అందజేసే లక్ష్యంతో సిల్వర్ ఓక్స్ పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సిల్వర్ వోక్స్ స్ట్రీట్ స్టోర్ కి అపూర్వ స్పందన లభించింది. కార్యక్రమంలో భాగంగా సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ విద్యార్థులు తమ ఇళ్ల నుండి, వారి బంధువులు, స్నేహితుల నుండి ఇరవై ఐదు వేల ఉపయోగించని మరియు అనవసరమైన వస్తువులు, పుస్తకాలు, బొమ్మలు, బట్టలు, స్కూల్ బ్యాగులు, బూట్లు మరియు ఇతర ఉపయోగకరమైన వస్తువులను సేకరించారు. . సమాజంలోని అణగారిన వర్గాల నుండి రెండు వందల మంది పిల్లలు మరియు పెద్దలు పాఠశాలలను సందర్శించారు మరియు వారి వ్యక్తిగత లేదా కుటుంబ వినియోగానికి ఉపయోగపడే వస్తువులను ఎంచుకున్నారు. సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్ నిర్వహిస్తున్న ఈ కార్య క్రమాల గురించి మరిన్ని వివరాల కోసం 9963980259/9985310069 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఆ పాఠశాల నిర్వాహకులు కోరారు

ఘనంగా గణేష్ నిమజ్జనం

విశాలాంధ్ర - పరవాడ : మండలంలోని ఈ భోనంగి గ్రామంలో గణేష్ నిమజ్జన కార్య క్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గణేష్ నిమజ్జనం నేపథ్యంలో ట్రాక్టర్‌పై వినాయకుడిని పురవీధుల్లో ఊరే గించారు. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన వేషధారణ చూపరులను ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనకు భక్తులు పెద్దఎత్తున పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. పిల్లలకు, మహిళలకు ఆటల పోటీలు న్విహించి బహుమతులు అందజేసారు. బుగిడి రామగోవిందరావు, చందక గోవిందరావు, మేడిశెట్టి అప్పారావు, బుగిడి రమణారావు, దాముర్తోతి నర్సింగరావు, గొల్లవిల్లి గంగరాజు, ఇరోతి రమేష్, పడాల వెంకటేష్, కట్టమూరి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

డైట్ అధ్యాపకులు పాఠశాలల సందర్శన

విశాలాంధ్ర - కే.కోటపాడు : మండలంలోని చంద్రయ్యపేట, కే సంతపాలెం, దేవరపల్లిలోని పలు పాఠశాలలను డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవి , అధ్యాపకులు త్రినాధరావు , హరిణి శనివారం సందర్శించారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, పాఠ్య ప్రణాళికలు, ఉపాధ్యాయుల డైరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవి మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్లంలో నైపుణ్యం సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. చదువుతోపాటు విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలన్నారు. దేవరపల్లి ప్రాథమిక పాఠశాలలో తరగతులు వారిగా ప్రణాళికలు డైరీలు లేకుండా బోధన చేయడం గమనించి హెచ్ ఎమ్ శ్రీనివాసులు నాయుడు , ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి వెంట కే కోటపాడు ఎంఈఓ 2 డివిడి ప్రసాద్ పాల్గొన్నారు.

బ్యాంక్ అభివృద్ధికి సభ్యులంతా సహకరించాలి

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ 98వ వార్డ్ పరిదిలో ఉన్న అడవివరం స్మార్ట్ విశాఖ అడవివరం సహకార పరపతి సంఘం ప్రైవేట్ లిమిటేడ్ అర్ధ సంవత్సర సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో పలువురు సభ్యులు బ్యాంక్ అభివృద్ధికి, లోటు పాట్లు బహిరంగంగా పాలక మండలి సభ్యులకు తెలిపారు. అనంతరం సంఘం అధ్యక్షులు కర్రి అప్పలస్వామి సభ్యులడిగిన వివిద ప్రశ్నలకు సమాదాన మిచ్చారు. బ్యాంక్ అభివృద్ధికి వెన్నంటి సహయ సహకారాలు అందించిన సభులకు కృజ్ఞతలు తెలిపారు. ఈ బ్యాంక్ మనందరిది, బ్యాంక్ అభివృద్ధికి సభ్యులంతా సహకరించాలని, ఇప్పటికే వివిద ఋణాలు తీసుకున్న సభ్యులు క్రమం తప్పకుండా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

విశాలాంధ్ర - కొమ్మాది : వైఎస్ఆర్ నగర్ యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ రోజు మాజీ మంత్రి భీమిలి ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ రావు వైఎస్ఆర్ నగర్ ప్రతేక పూజలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నామాల అనేష్ కుమార్ కూ గత కొన్ని సంవత్సరాలుగా గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్త నందుకు శాలువాతో సత్కరించారు. శనివారం భారీ అన్నసతర్పన కార్యక్రమం ఉన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యమంలో వైసీపీ అధ్యక్షుడు పోతన హనుమంత రావు, అర్చకులు శ్రీ కాంత్ శర్మ , కమిటీ సభ్యులు మహేష్, శేఖర్, నాని, రమణ, కుమార్, హేమంత్, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - చింతూరు : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రంపచోడవరం జిల్లా కమిటీ సమావేశం కుంజా రాధ అధ్యక్షతన చింతూరులో జరిగింది. ఈ సమావేశాంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.పద్మావతి మాట్లాడుతూ అక్టోబర్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు పూర్తి అయినా మహిళల పైన, చిన్నారులపైన హత్యలు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని, మహిళలకు రక్షణ, భద్రత కరువయ్యాయని ఇలా జరగటానికి కొంత కారణం అవుతున్న మద్యాన్ని, మత్తు పదార్థాలను నియంత్రించాలని ఇటీవల ఐద్వా రాష్ట్ర వ్యాప్తంగా పోరుయాత్ర చేసిందన్నారు. అవనిలో సగం, ఆకాశంలో సగం అయి అన్ని రంగాలలో మహిళలు ముందుకు వెళుతున్నప్పటికీ సమానత్వం కోల్పోతున్నామన్నారు. ఈనాడు చంద్రయాన్-3 లో 55 మంది మహిళా శాస్త్రవేత్తలు ఘనమైన విజయం సాధించారు. అయినా మహిళా అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. మణిపూర్లో ఆదివాసి గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారానికి పాల్పడిన వారిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకుండా వారిని ప్రోత్సహిస్తున్నది. కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెడుతున్నది అన్నారు. మహిళల్లో విద్యా, వైద్యం, ఉపాధి సమస్యలు అధిగమించేందుకు బడ్జెట్ పెంచాలి అన్నారు. ఈ ప్రభుత్వాలు మహిళలను ఓటు బ్యాంకుగా వాడుకోవాలని చూస్తున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర అభివృద్ధి సాధన బడ్జెట్లో కేటాయింపులు పెంచాలని, చౌక దుకాణాల ద్వారా సబ్సిడీ ధరలకే నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, గ్యాస్ బండను 500 రూపాయలకి ఇవ్వాలని అన్నారు. నారీ ద్రోహి మోడీని, కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇచ్చే వారిని ఎదిరించాలని అన్నారు. దేశవ్యాప్తంగా మహిళలు హింస వ్యతిరేక యాత్ర జరుపుకుంటూ అక్టోబర్ 5వ తేదీన ఢిల్లీ చేరుకొని జంతర్ మంతర్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ బహిరంగ సభలో పాల్గొనటానికి మహిళలు ఢిల్లీ రావాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు రంగమ్మ గారు, సున్నం పార్వతి, సుధారాణి, భద్రమ్మ, ధారమ్మ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి వైసీపీ నాయకులు

విశాలాంధ్ర - మునగపాక : మునగపాక జనసేన పార్టీ కార్యాలయంలో వైసిపి నాయకులు జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు మొల్లేటి ఆనంద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో మునగపాక గ్రామానికి చెందిన వైసీపీ యువ నాయకులు ఆడారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా విజయకుమార్ జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రోడ్డులు వేయకుండా ఐదు సంవత్సరాలు గాలికి వదిలేసిందని ధ్వజమెత్తారు. ప్రయాణికులు ఎప్పటికప్పుడు ప్రమాదాలు గురవుతున్నారని వాపోయారు. రాష్ట్రంలో రాక్షస పాలన జరుగుతుందని ప్రభుత్వంపై విమర్శలు చేస్తే అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన టీడీపీ ఓటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. మునగపాక వైసీపీ కార్యకర్తలు ఆడారి సత్యనారాయణ, పెంటకోట సంతోష్, జి.సోమేశ్వరరావు, సూరిశెట్టి కొండ, తేజ, ఉమా అరబుపాలెం టీడీపీ కార్యకర్తలు టి.దుర్గారావు, ఏ.హరికృష్ణ, ఆర్ శేఖర్, ఎం.కిరణ్, ఏ చిన్న జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, కే.చంద్రమోహన్, ఒంపోలు సర్పంచ్ సూరిబాబు, ఎల్లపు సంతోష్, ప్రభాస్ శీను, దొడ్డి భాస్కరరావు, సూరిశెట్టి అప్పలనాయుడు, వీర మహిళ సరోజిని మండల జనసైనికులు అభిమానులు పాల్గొన్నారు.

బీసీ బాలుర హాస్టల్‌లో మెనూ సక్రమంగా అమలు చేయాలి

విశాలాంధ్ర - చోడవరం : చోడవరం బి.సి.బాలుర హాస్టల్ లో మెనూ సక్రమంగా అమలు చేయాలని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థి సంఘ ఎస్.ఎఫ్.ఐ. నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ విద్యార్థి వసతి గృహాలు పర్యవేక్షణలో భాగంగా కొత్తూరు జంక్షన్ సమీపంలో ఉన్న బి.సీ బాయ్స్ హాస్టల్ ను ఎస్.ఎఫ్.ఐ. విద్యార్థి సంఘం నాయకులు ఆదివారం పర్యవేక్షించారు. ప్రభుత్వ బి.సి. వసతి గృహం లోని అమలు జరుపుతున్న మెనూ, కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాట్ల పై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, వంట కుక్ ఒకరే ఉన్నట్లు తెలుసుకున్నారు. వసతి గృహంలో మౌలిక వసతులు లేక అరకొర మెనూ అమలుతో, విద్యార్థులు ఎదిగే వయస్సులో సరైన పౌష్టికాహారం అందక అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ. జిల్లా కమిటీ నాయకుడు ఎస్.ఎస్. కార్తీక్ మీడియా తో మాట్లాడుతూ సక్రమంగా భోజనం అందించడం లేదని, మెనూ అమలు చేయడం లేదని, వర్కర్ ఫుడ్ సరిగా ఉండటం లేదని అన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు వెంటనే న్యాయం చేయాలని, అధికారులు పర్యవేక్షణ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయకులు గొర్లి తరుణ్, ఎస్ లక్ష్మణరావు, ప్రసాదు, రాము తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపరులకు శిక్ష పడాలంటూ వైసీపీ శ్రేణులు పూజలు

విశాలాంధ్ర - నర్సీపట్నం : స్కిల్ డెవలప్మెంట్ స్కామ్ లో అరెస్టు అయిన చంద్రబాబు నాయుడును ఆ పార్టీ నాయకులు బయటకు తేవడానికి నానా తంటాలు పడుతున్నారని సిఐడి కస్టడీలో ఉన్న చంద్రబాబు నోరు మెదవకపోవడం చూస్తుంటే చంద్రబాబు తప్పు చేసినట్టు అర్థమవుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ అన్నారు. ఆదివారం శ్రీ కన్య కూడలిలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద స్కిన్ డెవలప్మెంట్ స్కామ్ లో అరెస్టు అయిన చంద్రబాబు నాయుడుకు కఠిన శిక్ష పడాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు చేసి 108 కొబ్బరికాయలు కొట్టారు. ఇన్ని రోజులు చంద్రబాబుపై ఎన్ని కేసులు ఉన్నా ఇప్పుడు వరకు కోటి నుంచి స్టీల్ తెచ్చుకొని బయట పబ్బం గడిపాడని ఇకపై ఆ రోజులు చల్లవని అన్నారు. లోకేష్ను కూడా అరెస్ట్ చేసే టైం దగ్గర పడింది అన్నారు. స్కిల్డెవలప్మెంట్ స్కాంలో కొన్ని కోట్లు ప్రజాధనం డ్యూటీ చేసిన చంద్రబాబు నాయుడికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. చంద్రబాబు సైకో మాదిరిగా వ్యవహరించకుండా మంచి బుద్ధులు ప్రసాదించాలని అమ్మవారిని కోరుకున్నారు. అనంతరం చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో వివిధ స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు చోటి , శ్రీనివాసరావు, సచివాలయాలు కన్వీనర్ తమరాన్ శ్రీనివాస్, టౌన్ ప్రెసిడెంట్ ఏకా శివప్రసాద్, ఏక రాజబాబు, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, శ్రీను, మాకిరెడ్డి బుల్లి దొర, జిల్లా కమిటీ సభ్యురాలు కొణతాల వరలక్ష్మి, గంటా లలిత, దేవత అరుణ, లోకవరపు శారద, రాజబాబు, కర్రీ రాంగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయడం అభినందనీయం

విశాలాంధ్ర - చింతపల్లి : మండల కేంద్రానికి కూత వేటు దూరంలోని చిన్నగెడ్డ గ్రామంలో గడచిన 20 రోజులుగా నీటి సమస్య గ్రామస్తులను వేధిస్తుంది. ఈ గ్రామంలో గడచిన 20 రోజులుగా మోటారు మరమ్మతులకు గురికావడంతో నీటి సమస్య తలెత్తింది. సమస్య పరిష్కారానికి గ్రామస్తులంతా గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత ను సంప్రదించి తాము ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కరించాలని విన్నవించుకోవడంతో ట్రాక్టర్ ద్వారా ట్యాంక్ ఏర్పాటు చేసి చిన్నగెడ్డ గ్రామస్తులకు నీటిని సరఫరా చేసేందుకు కృషి చేయడంతో, నీటిని సరఫరా చేసి సమస్య పరిష్కారానికి కృషిచేసిన సర్పంచ్ దురియా పుష్పలతకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాలంటరీ మండల అధ్యక్షుడు వేములపూడి పరమేశ్వరరావు ముర్ల భాస్కరరావు, కిముడు అప్పారావు, జర్త రాంబాబు, పాంగి సాధిబాబు, మర్రి మంగులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తరాలు మారుతున్నా మాదిగ కులాల కుటుంబాల పరిస్థితి మారడం లేదు

అల్లూరి జిల్లా ఇన్ఫోసిస్ ఇంటర్నేషనల్ అధికారి గెడ్డం బాపిరాజు మాదిగ

విశాలాంధ్ర - చింతపల్లి : తరాలు మారుతున్న మాదిగ కులాల కుటుంబాల పరిస్థితి మారడం లేదని అల్లూరి జిల్లా ఇన్ఫోసిస్ ఇంటర్నేషనల్ అధికారి గెడ్డం బాపిరాజు మాదిగ అన్నారు. ఆదివారం చింతపల్లి వచ్చిన ఆయన స్థానిక అంబేద్కర్ కాలనీని సందర్శించి అక్కడ మూడు నాలుగు తరాల నుంచి నివసిస్తున్న మాదిగ కులాల కుటుంబాలను కలసి వారి జీవన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పలు ఇళ్లలో మాదిగలు పడుతున్న ఇబ్బందులను చూసి ఆయన చలించిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతపల్లి ఎస్సీ మాదిగ కుటుంబాలను ప్రభుత్వం గుర్తించి కనీస అవసరాలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఓటు హక్కు కు తప్ప మాదిగ కుటుంబాలను ఏ ప్రభుత్వము మనసులుగా పరిగణించడం లేదని, అందుకే వారికి సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు. కనీసం నివసించడానికి నివాస గృహాలు కల్పించలేని ప్రభుత్వాలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఏజెన్సీలో మాదిగలను కూడా ప్రభుత్వాలు గుర్తించి వారికి కనీస అవసరాలు కల్పించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పర్యటిస్తూ విజయవాడలో నవంబర్ నెలలో జరగబోయే భారీ బహిరంగ సభకు మాదిగ కులాల కుటుంబాలను సమీకరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు చిందాడ జయలక్ష్మి, చిందాడ చిన్న, ధారబాబు, పెదపూడి నాగేష్, చిందాడ అప్పారావు, ఉప్పాడ శంకర్, వైనాల రాజు, చిందాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణ కార్మిక సంఘం ఏర్పాటు

విశాలాంధ్ర - కొమ్మాది : మధురవాడ ప్రాంతంలో సీఐటీయు అనుబంధంగా శ్రీ కృష్ణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం ఏర్పాటయింది. కొమ్మాది కూడలి వద్ద సీఐటీయు కార్యాలయంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సంగం విదిధానాలు రూపొందించుకొని, కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులు, సలహా దారులుగా సీటు నాయకులు పి.రాజుకుమార్, ఏ.నిలయ్య, అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఏ.లక్ష్మణరావు, కే.రమణ, కార్య దర్శులుగా ఎంసత్యం, ఎస్.రమణ, కోశాధికారిగా కే.లక్ష్మణ, కమిటీ సభ్యులుగా ఏ.నరసింగరావు, కే.చిన్నప్పన్నలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిఐటీయు జోన్ ఉపాధ్యక్షులు డీ.అప్పలరాజు మాట్లా డుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమంతో పాటు వారి హక్కుల కోసం సంగం సమర శీలంగా నిలబడాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని తెలియ జేశారు. వైఎస్ ఆర్‌సిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుండి నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుని నిర్వీర్యం చేసి అన్యాయం చేసిందని తెలియజేశారు. సంక్షేమ బోర్డు నిధులు వెనక్కి తెచ్చుకునే దానికోసం జరిగే పోరాటాల్లో సంఘ సభ్యులు భాగస్వామ్యం కావాలని కోరారు. వీటితో పాటు ప్రజా హిత కార్యక్రమాలు నిర్వహించాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ ధనుంజయ, జి.అప్పల నరసయ్య, ఎం.శ్రీను, జి.భద్రయ్య, ఎన్.శంకర్, వై.రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధన

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : మండలంలోని ఉమ్మడివరం గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం దగ్గర ఏర్పాటు చేసిన విగ్నేశ్వర స్వామి మండపం వద్ద గ్రామ ప్రజలు మహా అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దలు చిన్నలు అందరూ అన్నదాన కార్యక్రమం లో పాల్గొని స్వామివారి ప్రసాదాలను స్వీకరించి తరించారు.